క్లుప్తంగా

నేడు కరాటే శిక్షణ ముగింపు వేడుక

నిర్మల్‌టౌన్‌: ఝాన్సీ లక్ష్మీబాయి కరాటే శిక్షణ సమితి ఆధ్వర్యంలో గత నెల 24న ప్రారంభమైన వేసవి ఉచిత కరాటే శిక్షణకు సంబంధించిన ముగింపు కార్యక్రమం బుధవారం నిర్వహించనున్నట్లు కరాటే శిక్షకురాలు కిన్నెర్ల మణాళిని మంగళవారం ఓ ప్రకటనలో తెలిపారు. జిల్లా కేంద్రంలోని ఆర్కే కన్వెన్షన్‌ హాల్లో సాయంత్రం 5:30 గంటలకు నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. దీనికి ముఖ్య అతిథులుగా ఎస్పీ జానకి షర్మిల, ప్రభుత్వ పరీక్షల అసిస్టెంట్‌ కమిషనర్‌ సిద్ధ పద్మ, వక్త దిగంబర్‌ హాజరవుతారని వెల్లడించారు.

బాధిత కుటుంబానికి చేయూత



సాయం అందిస్తున్న సభ్యులు

మామడ: మండలంలోని కొరిటికల్‌ గ్రామానికి చెందిన గవ్వల రవి ఉపాధి కోసం ఖతార్‌ దేశం వెళ్లి ఇటీవల మృతి చెందాడు. మంగళవారం బాధిత కుటుంబాన్ని గల్ఫ్‌ సేవా సమితి కొరిటికల్‌ ఆధ్వర్యంలో రూ.18,500 ఆర్థిక సాయం అందించారు. కార్యక్రమంలో గల్ఫ్‌ సేవా సమితి గ్రామ సభ్యులు దేవ్వళ్ల మధు, లింగం, కోండ్ర చిన్నయ్య, గవ్వల పోశెట్టి, నరేశ్‌, మహేశ్‌, మేక రాములు, పుట్టి రాజు, హరీశ్‌, ముత్యం తదితరులు పాల్గొన్నారు.

పర్యావరణ పరిరక్షణ మనందరి బాధ్యత



చిన్నారులతో బంతులు చేయిస్తున్న సీడీపీవో

ఖానాపూర్‌: పర్యావరణ పరిరక్షణ మనందరి బాధ్యత అని ఐసీడీఎస్‌ సీడీపీవో సరిత అన్నారు. మంగళవారం మండలంలోని పాత ఎల్లాపూర్‌, కొత్తపేట అంగన్‌వాడీ కేంద్రాలను సందర్శించారు. ఆయా కేంద్రాల్లో గ్రామస్తులు, పలువురు చిన్నారులతో సీడ్‌ బాల్స్‌(విత్తన బంతుల)ను తయారు చేయించారు. అనంతరం వాటిని పలువురికి పంపిణీ చేశారు. బుధవారం పర్యావరణ దినోత్సవం సందర్భంగా ప్రతీ ఒక్కరూ మొక్కలు నాటి సంరక్షించాలని సూచించారు. అంతకుముందు అంగన్‌వాడీ కేంద్రాల్లోని రిజిస్టర్లను పరిశీలించారు. కార్యక్రమంలో సూపర్‌వైజర్‌ శ్రీలత, అంగన్‌వాడీ టీచర్లు ఉన్నారు.

గ్రామాల్లో వర్షం



ఖానాపూర్‌ బస్టాండ్‌లో వర్షపునీరు

ఖానాపూర్‌: పట్టణంతోపాటు మండలంలోని పలు గ్రామాల్లో మంగళవారం వర్షం కురిసింది. ఈదురుగాలులతో కూడిన వర్షంతో వాతావరణం పూర్తిగా చల్లబడింది. పలు కొనుగోలు కేంద్రాల్లో ఉన్న రైతుల వరిధాన్యం స్వల్పంగా తడిసింది. మరోవైపు కొందరు రైతులు ఖరీఫ్‌ పనుల్లో నిమగ్నమయ్యారు.

సారంగపూర్‌: మండలంలోని ఆయా గ్రామాల్లో మంగళవారం భారీ వర్షం కురిసింది. మధ్యాహ్నం వరకు ఎండ ప్రభావంతో ఉక్కపోతతో ప్రజలు ఇబ్బంది పడ్డారు. ఒక్కసారిగా వాతావరణం చల్లబడి అరగంట భారీ వర్షం కురువడంతో ఉక్కపోత నుంచి జనాలు ఉపశమనం పొందారు.

సుద్దవాగులో చెత్తమయం..!



సాత్‌పూల్‌ వంతెన సమీపంలో సుద్దవాగులో పేరుకుపోయిన చెత్తాచెదారం

భైంసాటౌన్‌: పట్టణంలోని సుద్దవాగులో నీరంతా దుర్గంధమయంగా మారింది. డ్రైనేజీల్లో నుంచి చెత్తాచెదారం కాలువల ద్వారా వాగులో కలుస్తుండడంతో ప్లాస్టిక్‌, చెత్త వ్యర్థాలతో దర్శనమిస్తోంది. సాత్‌పూల్‌, ఆటోనగర్‌ బైపాస్‌ రోడ్‌ వంతెనల వద్ద నీటిలో ఇలా చెత్త పేరుకుపోయి దుర్గంధం వెదజల్లుతోంది. అంతేగాక వంతెనల వద్ద కొందరు చెత్త పారవేస్తుండడంతో నీటిలో కలిసిపోతోంది. సంబంధిత అధికారులు చెత్త నిర్వహణపై దృష్టి సారించాలని పలువురు కోరుతున్నారు.

పూడికతీతపై నిర్లక్ష్యమేల..?



పోలీసుస్టేషన్‌ ముందు చెత్తాచెదారంతో మురుగుకాల్వ

- కుభీర్‌లో అధ్వానంగా మురుగుకాల్వలు
- పేరుకుపోయిన పూడిక, చెత్తాచెదారం
- దుర్గంధంతో ఇబ్బంది పడుతున్న స్థానికులు
- పట్టించుకోని అధికారులు

కుభీర్‌: మండల కేంద్రంలో మురుగు కాల్వలు అధ్వానంగా మారాయి. ఎక్కడికక్కడ చెత్తాచెదారం, పూడిక పేరుకుపోయి దుర్గంధం వెదజల్లుతోంది. మరోవైపు వీధుల్లో పారిశుధ్యం లోపించడంతో ప్రజలు రోగాల బారిన పడుతున్నారు. అధికారులు, పాలకులు స్పందించి వర్షాకాలంలో సీజనల్‌ వ్యాధుల బారిన పడకుండా మురుగుకాల్వలను శుభ్రం చేయించి.. ఖాళీస్థలాల్లో పడేసిన చెత్తాచెదారం తొలగించాలని స్థానికులు కోరుతున్నారు.

మండల కేంద్రంలో..

మండల కేంద్రమైన కుభీర్‌లోని జీబు అడ్డా నుంచి పోలీస్‌స్టేషన్‌ ముందుగా వాగు వరకు ఉన్న పెద్ద మురుగు కాల్వ చెత్తాచెదారంతో నిండిపోయింది. స్థానిక ప్రభుత్వ ఆసుపత్రి ముందు కొందరు మురుగు కాల్వపై చిన్న షెడ్లు ఏర్పాటు చేసుకోవడంతో మురుగు నీటి ప్రవాహం సక్రమంగా ముందుకు సాగడం లేదు. చెప్పులు, ప్లాస్టిక్‌ కవర్లు, ఇతర వ్యర్థాలతో మురుగుకాల్వలు నిండిపోయాయి. కొన్ని చోట్ల పిచ్చిమొక్కలు ఏపుగా పెరిగాయి. పశువైద్యశాల నుంచి మహాలక్ష్మీ ఆలయం వరకు బట్టిగల్లీలో మురుగుకాల్వ గడ్డి, పిచ్చిమొక్కలతో అస్తవ్యస్తంగా మారింది.

వర్షాలు కురువకముందే శుభ్రం చేయండి



మురుగుకాల్వల్లో పూడిక పేరుకుపోవడంతో దుర్గంధం వెదజల్లుతోంది. వర్షాలు కురవకముందే కాల్వలను శుభ్రం చేయాలి. లేకుంటే వర్షపు నీరు, మురుగునీరు రోడ్లపై పారడంతోపాటు ఇళ్లలోకి వస్తుంది. ప్రజలు రోగాల బారి పడకముందే గ్రామపంచాయతీ వారు సమస్య పరిష్కరించాలి.

– ఉప్పు దత్తాత్రి, కుభీర్‌

నిధులు రాగానే శుభ్రం చేయిస్తాం

గ్రామపంచాయతీకి నిధుల్లేవ్‌. జనరల్‌ ఫండ్‌ నుంచే పారిశుధ్య కార్మికుల జీతాలు చెలిస్తున్నాం. కరెంట్‌ బిల్లులు, ట్రాక్టర్‌ కిస్తీలు, పారిశుధ్య కార్మికుల జీతాలకే ఇబ్బందిగా ఉంది. ఇప్పటికే చిన్న మురుగు కాల్వలు శుభ్రం చేశాం.. నిధులు రాగానే ఈ పెద్ద కాల్వలను శుభ్రం చేయిస్తాం.

– విజయ్‌, ఈవో, కుభీర్‌

కాల్వలను శుభ్రం చేయండి..

మండల కేంద్రంలో బాగా లోతు ఉన్న ఈ మురుగుకాల్వలను పారిశుధ్య కార్మికులు శుభ్రం చేయాలంటే అష్టకష్టాలు పడాల్సిందే. దీంతో కొన్నేళ్లుగా ఈ కాల్వలను శుభ్రం చేయించేందుకు ఏటా పొక్లెయిన్లను వినియోగిస్తారు. కానీ ఈ సంవత్సరం వర్షాకాలం ప్రారంభం కావొస్తున్నప్పటికీ కాల్వలను శుభ్రం చేయలేదు. ఈ మురుగుకాల్వలను శుభ్రం చేయకుంటే వరద, మురికి నీరు కలిసి రోడ్డుపై పారడమే కాక ఇళ్లలోకి వచ్చే ప్రమాదం ఉంది. దోమలు వ్యాప్తి చెంది సీజనల్‌ వ్యాధులు ప్రబలుతాయి. ఇప్పటికైనా అధికారులు, పాలకులు స్పందించి మురుగు కాల్వలను శుభ్రం చేసి చెత్తాచెదారం తొలగించాలని పలువురు కోరుతున్నారు.



పశువైద్యశాల వెనుక ఉన్న కాలువ..



మేదరి కాలనీ వద్ద మురికి కాలువ

పూర్వవిద్యార్థుల సమ్మేళనం



పాఠశాల వద్ద పూర్వవిద్యార్థులు

కుంటాల: మండల కేంద్రంలోని జెడ్పీ ఉన్నత పాఠశాలలో 2000–01లో పదో తరగతి చదివిన విద్యార్థులు అపూర్వ సమ్మేళనం నిర్వహించారు. మంగళవారం పాఠశాలలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఒకరికొకరు యోగక్షేమాలు అడిగి తెలుసుకున్నారు. నాటి జ్ఞాపకాలను నెమరువేసుకొని ఉత్సాహంగా గడిపారు. కార్యక్రమంలో పలువురు పూర్వవిద్యార్థులు పాల్గొన్నారు.

పాఠశాలల్లో పనులు పూర్తి చేయాలి

లోకేశ్వరం: అమ్మ ఆదర్శ పాఠశాలల్లో చేపట్టిన పనులు త్వరగా నాణ్యతతో పూర్తి చేయాలని మండల ప్రత్యేకాధికారి, డీడబ్ల్యూవో నాగమణి అన్నారు. ఈసందర్భంగా ఆమె మండలంలోని సేవాలాల్‌తండా పాఠశాలలో పనులు పరిశీలించి మాట్లాడారు. పనులను ప్రధానోపాధ్యాయులు పర్యవేక్షించాలన్నారు. నర్సరీలో మొక్కలు ఎండిపోకుండా చూడాలన్నారు. గ్రామాల్లో రోడ్లు, మురుగుకాల్వలను శుభ్రంగా ఉంచాలని సిబ్బందికి సూచించారు. ఎంపీడీవో సోలమాన్‌రాజ్‌, పాఠశాలల ప్రధానోపాధ్యాయులు ప్రవీణ్‌కుమార్‌, ఉపాధిహామీ టీఏ శారద, కార్యదర్శి వినయ్‌, ఎఫ్‌ఏ శ్రీనివాస్‌ ఉన్నారు.



సేవాలాల్‌తండాలో పరిశీలిస్తున్న నాగమణి

నిర్మల్‌లో ఎంఐఎం సంబురాలు

నిర్మల్‌టౌన్‌: ఎంఐఎం జాతీయ అధ్యక్షుడు, హైదరాబాద్‌ ఎంపీగా అసదుద్దీన్‌ ఓవైసీ ఐదోసారి విజయం సాధించడంతో మంగళవారం నిర్మల్‌లో ఆ పార్టీ నాయకులు సంబురాలు చేసుకున్నారు. ఈ సందర్భంగా ఆ పార్టీ కార్యాలయం వద్ద స్వీట్లు పంచుకుంటూ ఒకరికొకరు శుభాకాంక్షలు తెలుపుకొన్నారు. కార్యక్రమంలో పార్టీ జిల్లా అధ్యక్షుడు అ జీమ్‌బిన్‌, మున్సిపల్‌ కౌన్సిలర్లు మహమ్మద్‌ ముజాహిద్‌ అలీ, సయ్యద్‌ అబ్రారుల్‌ హసన్‌, పట్టణ ప్రధాన కార్యదర్శి, మున్సిపల్‌ కోఆప్షన్‌ సభ్యులు సయ్యద్‌ మజహర్‌, మున్సిపల్‌ మాజీ కౌన్సిలర్‌ రఫీ అహ్మద్‌ ఖురేషి తదితరులు పాల్గొన్నారు.



మిఠాయిలు పంచుకుంటున్న నాయకులు

అప్పుడు తల్లి.. ఇప్పుడు తండ్రి

- కన్నవారి మృతితో అనాథలైన దివ్యాంగులు
- విరాళాలతో తండ్రి అంత్యక్రియలు

కుంటాల: నాలుగేళ్ల కిందట తల్లి.. సోమవారం రాత్రి తండ్రి మరణించడంతో వారి పిల్లలైన దివ్యాంగులు అనాథలుగా మారారు. కుంటాల మండల కేంద్రానికి చెందిన సాంగి హంస–శ్రీనివాస్‌ దంపతులకు 17 ఏళ్ల కిందట వివాహమైంది. వీరికి ఇద్దరు కూతుళ్లు అక్షయ(15), అనుప్రియ (13) ఉన్నారు. ఆడపిల్లల రూపంలో తమ ఇంటికి మహాలక్ష్మి వచ్చిందని భావించారు. అయితే పిల్లలు ఎదుగుతున్న క్రమంలో వారిలోని వైకల్యాలు బయటపడాయి. ఇద్దరికీ చెవులు వినిపించవు. మాటలు రావు. ఎన్ని ఆసుపత్రులు తిరిగినా నయం కాలేదు. ఆస్తిపాస్తులు లేకపోయినా ఉన్నంతలో జీవనం సాగిస్తూ వచ్చారు. కానీ.. నాలుగేళ్ల కిందట తల్లి హంస అనారోగ్యంతో మృతి చెందింది. దీంతో దివ్యాంగులైన పిల్లలకు తండ్రి శ్రీనివాసే తల్లి కూడా అయ్యాడు. వారి బాగోగులు చూసుకుంటున్నారు. సోమవారం రాత్రి శ్రీనివాస్‌ కూడా గుండెపోటుతో మృతి చెందాడు. దీంతో ఆ కుటుంబంలో విషాదం నెలకొంది. ఎలాంటి ఆస్తి పాస్తులు లేకపోవడంతో గ్రామస్తులు, దాతల సహకారంతో రూ.1.02 లక్షలు విరాళంగా సేకరించి మంగళవారం అంత్యక్రియలు నిర్వహించారు. తల్లిదండ్రులను కోల్పోయి అనాథలుగా మారిన దివ్యాంగులైన ఆడపిల్లలను చూసి గ్రామస్తులు కంటతడి పెట్టారు. దాతలు ముందుకొచ్చి చిన్నారులకు అండగా నిలవాలని గ్రామస్తులు కోరుతున్నారు. ఆర్థికసాయం చేసేవారు 8186064040 నంబర్‌కు ఫోన్‌ పే, లేదా గూగుల్‌ పే చేయాలని విన్నవించారు.



తండ్రి సాంగి శ్రీనివాస్‌ తో కూతుళ్లు (ఫైల్‌)

తూకంలో మోసం చేయొద్దు

- జిల్లా తూనికలు, కొలతల శాఖ అధికారి భూలక్ష్మి

లోకేశ్వరం: తూకంలో మోసం చేస్తే కఠిన చర్యలు తప్పవని నిర్మల్‌ జిల్లా తూనికలు, కొలతల అధికారి భూలక్ష్మి అన్నారు. మండల కేంద్రంలోని కిరాణ, హార్డ్‌వేర్‌ షాపుల్లోని తూకాలను మంగళవారం పరిశీలించారు. ఈసందర్భంగా భూలక్ష్మి మాట్లాడుతూ ఎక్కడైనా తూకంలో మోసం జరిగితే వెంటనే తమ దృష్టికి తీసుకురావాలని అన్నారు. ప్రతీ ఏడాదిలో తూనికలు, కొలత శాఖ నుంచి షాపు యజమానులు అనుమతులు పొందాలన్నారు. ప్రతీ షాపులో తూకం వేసే 30 కేజీల నుంచి 100 కేజీల బరువులను తూకం వేసే తూకాలకు రూ.1,500లను చెల్లించి రశీదులను పొందాలని సూచించారు. ఆమె వెంట తూనికలు కొలత శాఖ లైసెన్స్‌ రిపేరర్‌ ఫయాజ్‌ఖాన్‌, శ్రీనివాస్‌ ఉన్నారు.



లోకేశ్వరంలోని ఓ దుకాణంలో కాంటాను పరిశీలిస్తున్న అధికారి భూలక్ష్మి

అటెన్షన్‌ ప్లీజ్‌.. ప్రమాదకరంగా మినీ ట్రాన్స్‌ఫార్మర్లు



కుభీర్‌: మండలంలోని దార్‌కుభీర్‌ గ్రామంలో ముద్ద పోతన్న ఇంటి ఎదుట రెండు మినీ ట్రాన్స్‌ఫార్మర్లు ప్రమాదకరంగా మారాయి. చేతికి తగిలేలా మూడు ఫీట్ల ఎత్తులో వీటిని స్తంభానికి ఏర్పాటు చేయడంతో చిన్నారులు, పశువులకు ముప్పు పొంచి ఉంది. విద్యుత్‌ అధికారులు స్పందించి మినీ ట్రాన్స్‌ఫార్మర్ల చుట్టూ కంచె ఏర్పాటు చేయాలని గ్రామస్తులు కోరుతున్నారు.

ప్రశ్నించాల్సిన అధికారి: అజీజుద్దీన్‌, కుభీర్‌ ఏఈ, ఫోన్‌: 94408 11711

బీజేపీ నాయకుల సంబురాలు

తానూరు: ఆదిలాబాద్‌ ఎంపీగా బీజేపీ అభ్యర్థి గోడం నగేశ్‌ గెలుపొందడంతో మండల కేంద్రంలో మంగళవారం ఆపార్టీ కార్యకర్తలు సంబరాలు చేసుకున్నారు. టపాసులు కాల్చి మిఠాయిలను పంచిపెట్టారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ మోదీ చేసిన అభివృద్ధిని చూసి ప్రజలు మరోసారి బీజేపీ అభ్యర్థులను గెలిపించారని పేర్కొన్నారు. కార్యక్రమంలో శివాజీ పటేల్‌, లక్ష్మణ్‌రెడ్డి, సోమ్‌నాథ్‌, బాలాజీ, ఆయా గ్రామాల కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

లోకేశ్వరం: ఆదిలాబాద్‌ ఎంపీగా బీజేపీ అభ్యర్థి గోడం నగేశ్‌ విజయం సాధించడంపై ఆ పార్టీ నాయకులు, కార్యకర్తలు సంబురాలు చేసుకున్నారు. మండలంలోని కిష్టాపూర్‌, రాయపూర్‌కాండ్లీ, ధర్మోరా, పంచగుడి, లోకేశ్వరం, పుస్పూర్‌, రాజూరా, మన్మద్‌, లోకేశ్వరం, పిప్రి, వట్టోలి తదితర గ్రామాల్లో బీజేపీ శ్రేణులు సంబురాలు చేసుకున్నారు. ప్రధాన వీధుల గుండా ర్యాలీలు తీసి బాణసంచా కాల్చారు. కార్యక్రమంలో సుమన్‌కుమార్‌, శ్రీకాంత్‌గౌడ్‌, రమేశ్‌, జయసాగర్‌, జీవన్‌, భాస్కర్‌, సాయన్న, మహేందర్‌రెడ్డి, రాజశేఖర్‌, గంగాజల సంజీవ్‌రెడ్డి, అనిల్‌ ఉన్నారు.

దస్తురాబాద్‌: మండల కేంద్రంతోపాటు మండలంలోని ఆకొండపేట, పెర్కపల్లె, మున్యాల, రేవోజీపేట గ్రామాల్లో బీజేపీ శ్రేణులు సంబురాలు చేసుకున్నారు. బీజేపీ మండలాధ్యక్షుడు కొడిమెల లక్ష్మణ్‌, నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

పెంబి: ఆదిలాబాద్‌ ఎంపీగా నగేశ్‌ విజయం సాధించడంతో మండలకేంద్రం, మందపల్లి తదితర గ్రామాల్లో బీజేపీ శ్రేణులు టపాసులు కాలుస్తూ సంబురాలు చేసుకున్నారు. కార్యక్రమంలో బీజేపీ మండల నాయకులు పాల్గొన్నారు.

ఖానాపూర్‌: రాష్ట్రంలో ఎనిమిది మంది బీజేపీ అభ్యర్థులు ఎంపీగా గెలుపొందడంతో పట్టణంలో ఆ పార్టీ శ్రేణులు సంబురాలు చేసుకున్నారు. టపాసులు కాల్చి మిఠాయిలు పంచిపెట్టారు. అనంతరం డప్పుచప్పుళ్ల నడుమ వీధుల్లో ఊరేగింపు నిర్వహించారు. కార్యక్రమంలో నాయకులు అంకం మహేందర్‌, నాయిని సంతోశ్‌, పడాల రాజశేఖర్‌, తోకల బుచ్చన్న, మల్లయ్య, సురేశ్‌, గోపాల్‌రెడ్డి, రంజిత్‌, కస్తూరి మహేశ్‌, కీర్తి మనోజ్‌, దాసరి శ్రీనివాస్‌, రాజేశ్వర్‌, శ్రీనివాస్‌ తదితరులు ఉన్నారు.

కుంటాల: ఆదిలాబాద్‌ ఎంపీగా నగేష్‌ విజయం సాధించడంపై మండలంలోని ఆయా గ్రామాల్లో బీజేపీ నాయకులు సంబురాలు చేసుకున్నారు. బీజేపీ మండల కన్వీనర్‌ గుద్దేటి నర్సయ్య, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

భైంసాటౌన్‌: ఆదిలాబాద్‌ ఎంపీ అభ్యర్థిగా నగేశ్‌ గెలుపొందడంతో బీజేపీ శ్రేణులు సంబరాలు చేసుకున్నారు. పట్టణంలో ఎస్‌ఎస్‌ కాటన్‌లో టపాసులు కాల్చి మిఠాయిలు పంచిపెట్టారు.

నర్సాపూర్‌(జి): ఆదిలాబాద్‌ ఎంపీగా నగేశ్‌ గెలుపొందడంతో మండల కేంద్రంలో బీజేపీ నాయకులు బాణాసంచా కాల్చి సంబరాలు చేసుకున్నారు. కార్యక్రమంలో బీజేపీ నాయకులు మిట్టపల్లి రాజేందర్‌, సుధాకర్‌, దత్తురాం, బొల్లి గంగారాం, బర్కుంట లక్ష్మణ్‌ తదితరులు పాల్గొన్నారు.



తానూరులో సంబరాలు చేసుకుంటున్న నాయకులు



కుంటాల: కల్లూర్‌లో..



భైంసాలోని ఎస్‌ఎస్‌ కాటన్‌లో..



ఖానాపూర్‌లో స్వీట్లు పంచుతున్న నాయకులు



నర్సాపూర్‌(జి)లో..

మొక్కలు నాటేందుకు ఏర్పాట్లు చేయాలి

తానూరు: హరితహారంలో భాగంగా గ్రామాల్లో మొక్కలు నాటేందుకు అన్ని ఏర్పాట్లు చేయాలని ఎంపీడీవో మోహన్‌సింగ్‌ సూచించారు. మంగళవారం మండల పరిషత్‌ కార్యాలయంలో ఆయా గ్రామాల ఉపాధిహామీ టీఏలు, ఎఫ్‌ఏలకు నిర్వహించిన ప్రత్యేక సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రభుత్వ పాఠశాలలు, ప్రభుత్వ స్థలాలు, రోడ్లకు ఇరువైపులా మొక్కలు నాటించేలా ప్రణాళికలు సిద్ధం చేయాలని పేర్కొన్నారు. వర్షాలు కురువగానే గ్రామాల్లో మొక్కలు నాటించాలని సిబ్బందికి సూచించారు. నర్సరీలో ఉన్న మొలకలు ఎండిపోకుండా నీటిని అందించాలని సిబ్బందికి వివరించారు. కార్యక్రమంలో ఈజీఎస్‌ ఏపీవో గంగాధర్‌, ఆయా గ్రామాల టీఏలు, ఎఫ్‌ఏలు ఉన్నారు.



మాట్లాడుతున్న ఎంపీడీవో మోహన్‌సింగ్‌

‘బండి’ని కలిసిన రామారావుపటేల్‌



భైంసాటౌన్‌: కరీంనగర్‌ ఎంపీగా బండి సంజయ్‌ గెలుపొందడంతో కరీంనగర్‌లో నిర్వహించిన విజయోత్సవ ర్యాలీలో ముధోల్‌ ఎమ్మెల్యే రామారావు పటేల్‌ పాల్గొన్నారు. ఆదిలాబాద్‌లో బీజేపీ అభ్యర్థి నగేశ్‌ను కలిసి అభినందనలు తెలిపారు. ఎంపీ సంజయ్‌ని ఆలింగనం చేసుకొని శుభాకాంక్షలు తెలిపారు.

సాగు పనులు షురూ..



పెంచికల్‌పాడ్‌లో విత్తుతున్న కూలీలు

కుంటాల: మండలంలో సాగు పనులు ప్రారంభించారు. పలు చోట్ల చిరుజల్లులు కురువడంతో భూములను సిద్ధం చేసుకుంటున్నారు. మంగళవారం మండలంలోని పెంచికల్‌పాడ్‌, విఠాపూర్‌ల్లోని రైతులు పత్తి విత్తనాలను విత్తారు. వర్షం కురిస్తే మొలకెత్తుతాయనే ఆశతో విత్తినట్లు రైతులు పేర్కొన్నారు.